సాక్షి
నిర్మల్
శనివారం ¡ 22 ¡ జూలై ¡ 2023



వరదలో ‘గుండేగాం’

8లో▸

వర్షాలకు గుండేగాం గ్రామం నీట మునిగింది. రంగారావుపల్సికర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ అంతా గ్రామంలోకి చొచ్చుకువస్తోంది. వంతెన నీటమునిగి రాకపోకలు నిలిచిపోయాయి.



తహసీల్.. ఇక తెరమరుగు

నిర్మల్ తహసీల్ ఆఫీస్.. నిజాం కాలంలో రాజభవనంలా నిర్మించిన కట్టడం. మొన్నటి దాకా సేవలందించింది. శిథిలావస్థకు చేరిన భవనాన్ని అధికారులు కూల్చివేశారు.

9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.2 / 24.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లగా ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడనాల ప్రభావంతో జిల్లా అంతటా మోస్తరు వర్షం కురుస్తుంది.

జోరు తగ్గని వాన

- ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి
- నిండు కుండలా జలాశయాలు
- తెరుచుకున్న ప్రాజెక్టుల గేట్లు

భైంసా: జిల్లాలో వానజోరు తగ్గలేదు. శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తునే ఉంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు జలాశయాలు నిండు కుండలా మారాయి. పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి వరద నీటిని కిందకు వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తి వరదనీటిని బయటకు పంపించారు. స్వర్ణ ప్రాజెక్టు, గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని వదిలేశారు. మహారాష్ట్రలోనూ భారీ వర్షాలు కురుస్తుండడంతో బాసర వద్ద గోదావరి ఉరకలేస్తోంది. భారీ వరదలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో 92,590 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. దీంతో ఎస్సారెస్పీలో నీటిమట్టం 43.451 టీఎంసీలకుచేరింది. వర్షాలకు జిల్లాలో లోతట్టు ప్రాంతాలన్ని జలమయమయ్యాయి.

ఉప్పొంగిన వాగులు...


వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వాగులు ఉప్పొంగుతున్నాయి. గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో అర్లి వంతెన ఆనుకుని వరద నీరు ప్రవహిస్తుంది. పట్టణంలో బైపాస్ వద్ద, సాత్‌పూల్ వద్ద వరదనీటి ప్రవాహం పెరిగింది. దేగాం, బిద్రెల్లి, మహాగాం, మాటేగాంవాగులు ఉరకలెత్తుతూ ప్రవహించాయి. చిట్యాల వాగులోనూ నీటి ప్ర వాహం పెరిగింది. జిల్లాలో చెక్‌డ్యాంలు, చెరువులు, కుంటలు జలకళ సంతరించుకున్నాయి.

నిలిచిన రాకపోకలు...

వరద నీరు రోడ్లను ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బాసర, కిర్గుల్(బి), పాత ముధ్గల్ వెళ్లే రహదారులను వరదనీరు ముంచెత్తింది. గుండేగాం వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భైంసా పట్టణంతోపాటు ముధోల్, బాసర, కుభీర్, తానూరు, సారంగాపూర్, నిర్మల్, ఖానాపూర్, కడెం ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు బురదమయమయ్యాయి.

అత్యధికంగా కుంటాలలో...

జిల్లాలో శుక్రవారం 57.2 మిల్లీమీటర్ల సగటు వర్షాపాతం నమోదైంది. కుంటాల మండలంలో అత్యధికంగా 124.6 మిల్లీమీటర్ల వర్షాపా తం నమోదైంది. లక్ష్మణచాంద మండలంలో అత్యల్పంగా 16.2 మిల్లీమీటర్ల వాన కురిసింది.



గేట్లు ఎత్తడంతో కడెం జలాశయం నుంచి కిందకు దుంకుతున్న వరద

జిల్లా ప్రాజెక్టుల సమాచారం..

ప్రాజెక్టు	పూర్తి నీటిమట్టం	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో(క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో(క్యూసెక్కుల్లో)
కడెం	700 ఫీట్స్	688.900 ఫీట్స్	34.282	90.290
స్వర్ణ	1.183 ఫీట్స్	1.178 ఫీట్స్	1000	0
గడ్డెన్నవాగు	1.176.83 ఫీట్స్	1.174.5 ఫీట్స్	6.000	5.188

‘స్వర్ణ’కు పోటెత్తిన వరద

సారంగాపూర్: మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని స్వర్ణ ప్రాజెక్టుకు వరద పోటెత్తింది. అప్రమత్తమైన అధికారులు గురువారం అర్ధరాత్రి 3 గేట్లు ఎత్తి 1,300 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం ప్రాజెక్టు పరిస్థితి నిలకడగా ఉండడంతోపాటు ఎగువ నుంచి వరద రాకపోవడంతో ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 1000 క్యూసెక్కుల వరద నీటిని స్వర్ణ నదిలోకి కాలువల ద్వారా వదులుతున్నారు. ప్రాజెక్టులో 1,178 అడుగుల వద్ద స్థిరంగా ఉంచుతున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సందర్శించిన నాయకులు..

స్వర్ణ ప్రాజెక్టు నిండిన సమాచారం తెలుకున్న మండల నాయకులు, సర్పంచులు ప్రాజెక్టుకు చేరుకుని ప్రాజెక్టు పరిస్థితిని సమీక్షించారు. అక్కడే ఉన్న ప్రాజెక్టు అధికారి మధుపాల్‌తో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని పొట్యా, బండరేవు తండాల గ్రామాల మధ్య రహదారి కోతకు గురయింది.



స్వర్ణ ప్రాజెక్టు నుంచి దిగువకు వరద..

‘గడ్డెన్నవాగు’ నీటి విడుదల



ఒక గేటు నుంచి దిగువకు నీరు విడుదల

భైంసాటౌన్: భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు భారీగా ఇన్‌ఫ్లో వచ్చిచేరుతోంది. దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. అధికారులు శుక్రవారం ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, గేటు ఎత్తి 5 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.00 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తున్నారు.

మండలాల వారీగా శుక్రవారం నమోదైన వర్షపాతం (మి.మీలలో)

కుభీర్	తానూరు	బాసర	ముధోల్	భైంసా	కుంటాల	నర్సాపూర్	లోకేశ్వరం	దిలావర్‌పూర్	సారంగాపూర్	నిర్మల్	నిర్మల్‌రూరల్	సోన్	లక్ష్మణచాంద	మామడ	పెంబి	ఖానాపూర్	కడెం	దస్తురాబాద్
99.2	78.6	45	94.6	59.6	124.6	24.4	38	41.8	116.2	44.8	28.8	19.8	16.2	65.2	67.6	37.8	62.4	34.2

చదువులమ్మకు లేఖ!

- ట్రిపుల్‌ఐటీ సమస్యలు రాసి.. బాసర హుండీలో వేసి..
- హుండీ లెక్కింపులో గుర్తింపు
- మరోసారి వెలుగులోకి విద్యార్థుల కష్టాలు

నిర్మల్: ‘మహాలక్ష్మి, మహాకాళి సమేతంగా కొలువైన జ్ఞానసరస్వతీ అమ్మా.. మా పిల్లల భవిష్యత్తు కోసం వారి బాధలను తీర్చేందుకు మేం ఎందరికో విన్నవించుకున్నాం. జ్ఞానం అందించే తల్లిగా పిల్లల బాధలను తీర్చే విధంగా పాలకులు, అధికారులు మేల్కొనేలా చేయాలని ప్రార్థిస్తున్నాం’ అంటూ బాసర ఆర్జీయూకేటీలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల పేరిట జ్ఞానసరస్వతీ అమ్మవారికి లేఖ రాసి హుండీలో వేశారు. ఆలయంలో గురువారం చేపట్టిన హుండీ లెక్కింపులో ఈ లేఖ వెలుగులోకి వచ్చింది. ఇందులో కొన్నేళ్లుగా ట్రిపుల్ ఐటీ బాగు కోసం తాము విన్నపాలు చేసినా, తమ పిల్లలు ఎండనకా, వాననకా పోరాటాలు చేసినా ప్రభుత్వానికి కనికరం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా అధికారులు, అధ్యాపకుల ఒత్తిడులకులోనై కొంత మంది విద్యార్థులు మరణించారని తెలిపారు. పిల్లల ఆశలు, ఆశయాలు తమకు తెలియనికావు తల్లీ.. అంటూ పేర్కొన్నారు.



జ్ఞాన సరస్వతీ అమ్మవారు

ఒత్తిడిని తప్పించు తల్లీ..

బాసర ట్రిపుల్‌ఐటీలో ఇప్పటికీ విద్యార్థులపై ఒత్తిడి ఉందని, దీని కారణంగానే కొంతమంది ప్రాణాలను తీసుకున్నారని తల్లిదండ్రులు లేఖలో పేర్కొన్నారు. ప్రధానంగా పీయూసీ విద్యార్థులకు గతంలో ఉన్న సెమిస్టర్ పరీక్షల విధానాన్ని ఎత్తివేయడం ప్రభావం చూపుతున్నట్లుగా పేర్కొన్నారు. ఏడాది మొత్తం సిలబస్‌పై ఒకేసారి పరీక్షలు నిర్వహించే విధానం ఇబ్బందికరంగా మారిందన్నట్లు తెలిపారు. ఇలా కాకుండా 2023–24 విద్యాసంవత్సరం నుంచే పీయూసీ విద్యార్థులకు కూడా సెమిస్టర్ విధానాన్ని వర్సిటీ అధికారులు అమలు చేసేలా, పిల్లలపై ఒత్తిడిని తప్పించేలా చూడాలంటూ అమ్మవారిని కోరారు.

సార్లు ఉండాలమ్మా..

ఆర్జీయూకేటీపై ఎన్నో ఆశలతో తమ పిల్లలను ఇక్కడిదాకా పంపించామని, తీరా ఇక్కడ ఏళ్లుగా సమస్యలు తీరడం లేదన్న ధోరణిలో తల్లిదండ్రులు చదువుల తల్లికి మొరపెట్టుకున్నారు. చదువుల విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూడాలని కోరారు. వర్సిటీలో ఉన్న అన్ని ఇంజినీరింగ్ గ్రూపులకు ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ) నిబంధనల ప్రకారం విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్లు అధ్యాపకులు ఉండేలా చూడు తల్లీ.. అని కోరారు. అలాగే ఆర్జీయూకేటీ ప్రారంభం నుంచి ఉన్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) బోధనను మళ్లీ పీయూసీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు తప్పకుండా కొనసాగించేలా చూడాలన్నారు.

మెస్‌లు మారాలమ్మా..

బాసర ట్రిపుల్‌ఐటీలో తిండి విషయంలోనే ఎన్ని ఘటనలు జరిగినా పాలకుల్లో కదలిక లేకపోవడాన్ని తల్లిదండ్రులు లేఖలో ప్రస్తావించారు. మెస్ కాంట్రాక్టర్లు కలుషిత ఆహారం అందించడంతో వందలాది విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. గతంలో ఎన్ని ఘటనలు మెస్‌లలో జరిగినా వ్యవస్థలో మార్పురావడం లేదమ్మా అని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికీ మెనూ ప్రకారం కాకుండా ఒకే రకమైన కూరలు, టిఫిన్స్ పిల్లలకు పెడుతున్నారని వివరించారు. గతంలో చోటుచేసుకున్న ఘటనల తర్వాత ప్రభుత్వం ఇక్కడి మెస్‌లను హరేరామా.. హరేకృష్ణ(ఇస్కాన్) సంస్థకు అప్పగిస్తామని చెప్పారు. కానీ ఇప్పటికీ అప్పగించలేదని తెలిపారు. త్వరగా మెస్‌ల నిర్వహణను ఆ సంస్థకు అప్పగించేలా చూసి తమ పిల్లలను కాపాడు తల్లీ.. అని వేడుకున్నారు.

పోరాడిన ఫలితమేది తల్లీ..

చదువుకోవడానికి వచ్చిన తమ పిల్లలు ఇక్కడ ఎదుర్కొంటున్న సమస్యలను ఏళ్లుగా భరిస్తూ వచ్చారని, ఇక భరించలేని స్థితిలో గతేడాది శాంతియుత పోరాటానికి దిగారని తల్లిదండ్రులు గుర్తుచేశారు. సరిగ్గా ఏడాదిక్రితం వర్సిటీలోనే పోరాడారని, ఇందుకు స్పందించినట్లుగా వచ్చిన ప్రభుత్వం పైపై సమస్యలనే తీర్చిందని చెప్పారు. ఇప్పటికీ చాలామంది విద్యార్థులపై కేసులు ఉన్నాయని గుర్తుచేశారు. సర్కారు హామీ ఇచ్చినా ఇప్పటికీ చాలా సమస్యలు పెండింగ్‌లోనే ఉన్నాయని, వాటిని త్వరగా తీర్చేలా చూడాలని, తమ పిల్లల పోరాటాలకు సార్థకత వచ్చేలా దీవించాలని కోరారు.

పలు డిమాండ్లు..

- ముఖ్యమంత్రి కేసీఆర్ కచ్చితంగా క్యాంపస్‌ను సందర్శించాలి.
- వైస్‌చాన్స్‌లర్ తప్పనిసరిగా వర్సిటీలోనే ఉండాలి. మిగితా పోస్టులనూ భర్తీచేయాలి.
- పీయూసీ బ్లాక్‌లు, హాస్టళ్లను బాగుపర్చాలి.
- విద్యార్థులకు అనుకూలంగా లైబ్రరీలో అన్ని పుస్తకాలనూ అందుబాటులో ఉంచాలి.
- క్యాంటిన్ ఏర్పాటుతోపాటు వివిధ వసతులను మెరుగుపర్చాలి.
- క్రీడలపైనా ఆసక్తి పెంచేలా సంబంధిత పీడీ, పీఈటీ పోస్టులు భర్తీచేయాలి.
- ఉత్తమ విద్యాసంస్థలతో ఆర్జీయూకేటీ అనుసంధానం కావాలి.

న్యూస్‌రీల్

డ్రైడే పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న కలెక్టర్

నర్సాపూర్(జి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో డ్రైడే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి నరేష్‌కుమార్‌కు సూచించారు. గ్రామంలోని గంగపుత్ర కాలనీలో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో వారసంతను పరిశీలించి మార్కెట్ సముదాయనికి సూమారు రూ.10 లక్షల నిధులు మంజూరుకు తీర్మానం చేసి పంపాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలో సామూహిక ఇంకుడు గుంతలు, నీటి సేకరణ నిర్మాణం బాగున్నాయని అభినందించారు. డ్రైనేజీల్లో దోమలు, ఈగలు ప్రబలకుండా బయోటెక్ స్ప్రే, ఆయిల్ బాల్స్, ఫాగింగ్ పనులు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట సర్పంచ్ చెన్న మహేశ్, తహసీల్దార్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌కుమార్, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- డీఎంహెచ్‌వో ధనరాజ్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ధనరాజ్

దిలావర్‌పూర్: విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తద్వారా వ్యాధులు దరిచేరవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. దిలావర్‌పూర్ కేజీబీవీ పాఠశాల, కళాశాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఆర్‌బీఎస్‌కే బృందంతో కలిసి శుక్రవారం పరిశీలించారు. విద్యార్థినులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు తమ పరిసరాలు పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించారు. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారం అందించే తీరును తెలియజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీనివాస్, విస్తరణాధికారి రవీందర్, డాక్టర్ నాగేశ్వరరావు, ఫార్మసిస్ట్ జైపాల్, ఎస్‌వో అపర్ణ, ఎస్‌ఆర్‌టీలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లను సందర్శించిన డీఎస్పీ

ఖానాపూర్/పెంబి/దస్తురాబాద్: నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి జిల్లాలోని మూడు పోలీస్ స్టేషన్లను శుక్రవారం సందర్శించారు. ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ ఠాణాలను తనిఖీ చేశారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆయా ఠాణాలకు వచ్చిన గంగారెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంతోపాటు పట్టణ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పెంబి, దస్తురాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. పలు కేసులపై ఆరా తీశారు. మండలాల్లోని గ్రామాల గురించి తెలుసుకున్నారు. పోలీసులు ప్రజలతో మమేకమై శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలన్నారు. భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట ఖానాపూర్ సీఐ రవీందర్‌నాయక్, ఎస్సైలు ఆర్.శంకర్, ప్రభాకర్‌రెడ్డి, రజినీకాంత్, సిబ్బంది భీమరాజు, నవీన్, ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ

అభిమాన నేతకు కన్నీటి వీడ్కోలు

- జోరు వానలోనూ ఐదు గంటలు సాగిన అంతిమయాత్ర
- అధికార లాంఛనాలతో సీఆర్‌ఆర్ అంత్యక్రియలు
- తరలివచ్చిన అభిమానులు, రాజకీయ నాయకులు
- జనసంద్రమైన ఆదిలాబాద్



రోదిస్తున్న సీఆర్‌ఆర్ భార్య లక్ష్మీదేవి



అశేష అభిమానుల నడుమ రాంచంద్రారెడ్డి అంతిమయాత్ర

కైలాస్‌నగర్: ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత చిల్కూరి రాంచంద్రారెడ్డి అంత్యక్రియలు శుక్రవారం ప్రభుత్వ అధికార లాంఛనాలతో ముగిశాయి. ఎడతెరిపి లేని వానలోనూ వరుణుడే చిన్నబోయేలా అంతిమయాత్ర సాగింది. అశేష జనవాహిని తరలిరాగా డప్పుచప్పుళ్లు, అభిమానుల నృత్యాల నడుమ సాగిన తీరు సీఆర్‌ఆర్‌పై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చాటింది. స్థానిక శాంతినగర్‌లోని నివాసం నుంచి ఉదయం 11 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా మధ్యాహ్నం 3 గంటలకు తిర్పెల్లిలోని హిందూ శ్మశానవాటికకు చేరుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఆయన భౌతిక కాయాన్ని ఉంచి అంతిమయాత్ర చేపట్టారు. పార్టీలకతీతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. దారి పొడవునా సీఆర్‌ఆర్ అమర్‌రహే నినాదాలతో హోరెత్తించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సీఆర్‌ఆర్‌కు నివాళులర్పిస్తూ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

అధికార లాంఛనాలతో..

అభిమానుల అశ్రునయనాల నడుమ ప్రభుత్వ అధికార లాంచనాలతో సీఆర్‌ఆర్ అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడు రౌండ్లు గాల్లో కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించిన అనంతరం ఆయన చితికి తన మేనల్లుడు అల్లూరి సంజీవ్‌రెడ్డి నిప్పంటించారు. పోలీసుల గౌరవ వందన సమయంలోనూ సీఆర్‌ఆర్ జిందాబాద్ నినాదాలతో శ్మశానవాటిక మారుమోగింది. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సాగునీటి అభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, ఎస్.దివాకర్‌రావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వెంకట్రామ్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు అడ్డి భోజారెడ్డి, తిప్పని లింగయ్య, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, వణీ మాజీ ఎమ్మెల్యే వామన్‌రావు కాసావార్, బీజేపీ నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, సి.సుహాసినీరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఆర్.మనోహర్, యూనిస్ అక్బానీ, మాజీ మున్సిపల్ చైర్మన్ మనీషా తదితరులు పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు.

ప్రముఖుల నివాళి

సీఆర్‌ఆర్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి గురువారం అర్ధరాత్రి ఆదిలాబాద్ పట్టణం శాంతినగర్‌లోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచారు. తమ అభిమాన నేతను కడసారి చూసేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచే రాకుండా మహారాష్ట్ర, రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి సైతం పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, అభిమానులు, నాయకులు తరలివచ్చారు. ఆయన భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పీసీసీ జనరల్ సెక్రటరీ గండ్రత్ సుజాత, డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, నరేశ్‌జాదవ్ తదితరులు సీఆర్‌ఆర్ పార్థీవదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంత్‌రావు, కోదండరెడ్డి, మాజీ మంత్రి గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవింద్‌రెడ్డి సీఆర్‌ఆర్ భౌతికఖాయానికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న జీవన్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్



గాలిలోకి పోలీసుల కాల్పులు, హాజరైన మంత్రి ఐకేరెడ్డి, ఐడీసీ చైర్మన్ వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు, అధికారులు

అదనపు కలెక్టర్లు కావలెను..

- ఎప్పుడో ‘స్థానిక సంస్థల’ పోస్టు ఖాళీ
- తాజాగా ‘రెవెన్యూ’ అధికారీ బదిలీ



సమీకృత కలెక్టరేట్

నిర్మల్: జిల్లాలో రెండు అదనపు కలెక్టర్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ ఏడాది జనవరి 31న జిల్లా కలెక్టర్ ముషరఫ్‌అలీ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఐటీడీఏ పీవోగా ఉన్న వరుణ్‌రెడ్డి వచ్చారు. ఆయన రాగానే ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న హేమంత్‌బోర్కడేను కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై పంపించారు. ఇక అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంటోంది.

తాజాగా రాంబాబు బదిలీ..

జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఉన్న రాంబాబు బదిలీ అయ్యారు. ఈమేరకు గురువారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ ఉత్తర్వులిచ్చారు. ఆయన స్థానంలో జిల్లాకు ఎవరినీ కేటాయించలేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈ బదిలీలు చేపడుతున్నారు.

రెండూ ఖాళీగానే..

జిల్లాలో కలెక్టర్ తర్వాత ఆస్థాయి ప్రాముఖ్యత కలిగిన రెండు పోస్టులూ ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న హేమంతబోర్కడే ఫిబ్రవరిలో పదోన్నతిపై వెళ్లగానే, ఆ బాధ్యతలను రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా ఉన్న రాంబాబుకు ఇన్‌చార్జిగా అప్పగించారు. తాజాగా స్థానిక, రెవెన్యూ రెండు బాధ్యతలు చూస్తున్న రాంబాబు బదిలీ కావడంతో వీటి భారం కలెక్టర్ వరుణ్‌రెడ్డిపై పడింది. కొన్ని నెలలుగా స్థానిక సంస్థల అసిస్టెంట్ కలెక్టర్ లేకపోవడంతో సదరు పనుల్లో కొంత ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. తాజాగా రెవెన్యూ కూడా ఖాళీ కావడం, ప్రస్తుతం కలెక్టర్ బిజీగా ఉండటంతో ఇక రెండింటి సేవలకూ ఇబ్బంది కలిగేలా ఉందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల నేపథ్యంలో త్వరలోనే ఈపోస్టులను భర్తీ చేయవచ్చని చెబుతున్నారు.

క్లుప్తంగా

గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ఇంద్రవెల్లి: ఆదివాసీ గిరిజనుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డైరెక్టర్ ఆఫ్ పౌల్ట్రి రీసెర్చ్ హైదరాబాద్ డైరెక్టర్ ఆర్ఎన్ చటార్జీ అన్నారు. శుక్రవారం ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్, డైరెక్టరేట్ ఆఫ్ పౌల్ట్రి రీసెర్చ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గిరిజన ఉప పథకం కింద మంజూరు చేసిన పేరిటి కోళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా తుమ్మగూడ గ్రామస్తులకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజనులు పంపిణీ చేసిన పెరటి కోళ్లతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వివరించారు. పంపిణీ చేసిన వనరాజ, గ్రామప్రియ రకం కోళ్లని, పెంపుడు కోళ్లలాగనే ఈ కోళ్లను కూడా పెరటిలో పెంచుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో కోళ్లను పెంచి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రిన్సిపాల్ సైంటిస్టులు డాక్టర్ ఎస్‌వీ రామ రావు, డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ బి.ప్రకాష్, డాక్టర్ ఎల్ఎల్ ప్రిన్స్, సీనియర్ సైంటిస్ట్ డా.విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మడావి శేకు, గ్రామ పటేల్ సోయం మాన్కు, మహజన్ కనక లంకు, మాజీ ఎంపీటీసీ కనక హన్మంతరావ్ ఉన్నారు.

వసతుల కల్పనలో బీఆర్ఎస్ విఫలం



మాట్లాడుతున్న మధుయాష్కి గౌడ్

ఇచ్చోడ: ఆదివాసీ గ్రామాల్లో వసతుల కల్పనలో బీఆర్ఎస్ విఫలమైందని కాంగ్రెస్ క్యాంపెనింగ్ చైర్మన్ మధుయాష్కి గౌడ్ అన్నారు. దుబార్‌పేట్ గ్రామస్తుల ఇళ్లల్లో వరదనీరు చేరడంతో నిరసనగా జాతీయ రహదారిపై శుక్రవారం రాస్తారోకో చేస్తున్న సందర్భంగా వారిని కలిసి మాట్లాడారు. మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి అంత్యక్రియల కోసం ఆదిలాబాద్ వైపు వెళ్తుండగా రాస్తారోకో కారణంగా కాసేపు ఆగి వారితో మాట్లాడారు. జాతీయ రహదారి నిర్మాణంలో దుబార్‌పేట్ వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో ప్రతి ఏటా వర్షాకాలంలో గ్రామంలోకి వరద నీరు చేరుతుందన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు. దీంతో ఆదివాసీ గిరిజనులు ప్రతీ ఏటా వరద నీటితో నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడి కాంగ్రెస్ పార్టీ తరఫున శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రకాష్ రాథోడ్, డాక్టర్ కేతవత్ మోతిలాల్, దయాకర్‌గౌడ్ ఉన్నారు.

పంటలకు వరద ముప్పు

- నీరు నిల్వ ఉంటే తెగుళ్ల దాడి
- నివారణ చర్యలు తప్పనిసరి
- వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్



మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పలుచోట్ల పంట చేన్లు నీట మునిగాయి. కొన్ని ప్రాంతాల్లో వరద తాకిడికి పంటచేన్లలో ఇసుక మేటలు వేశాయి. పంటపొలాల్లో నీరు నిల్వ ఉంటే మొక్కలు కుళ్లిపోయే ప్రమాదముంది. ఇలాంటి సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే మొదటికే మోసం వస్తుంది. కాబట్టి వరద ప్రభావిత ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండి.. పంటచేన్లలో నీరు నిలిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహాన్ సూచించారు. ఆయన చేస్తున్న మరిన్ని సూచనలు రైతుల కోసం..

ఇలా చేస్తే మేలు

సాధ్యమైనంత వరకు పొలంలో నీరు నిల్వకుండా చూడాలి. ఒకవేళ నీరు నిలిస్తే కాల్వలు తీసి బయటకు పంపించాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. దీంతో భూమిలో తేమ తగ్గి వేర్లకు గాలి, పోషకాలు అంది మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 25కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు 5 నుంచి 6 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీసి వేయాలి. పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. దీంతో పంట పెరుగుదల తగ్గుతుంది. కాబట్టి పంటకు 20 గ్రాముల యూరియా లేదా 10 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటర్ నీటిలో కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

పత్తి పంటలో..

భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు 10 లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్‌ను 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బండిజమ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

మిరప పంటలో..

అధిక వర్షాలు, అధిక తేమతో మిరపలో ఆకుమచ్చ తెగులు, వేరుకుళ్లు, కాండం కుళ్లు, కొనోఫేరా కొమ్ము కుళ్లు, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలి.

ఆకుమచ్చ తెగులు: ఆకుల మీద గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు పండుబారి రాలిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు తెగులు: మొక్కలు వడలిపోయి ఎండిపోతాయి. దీని నివారణకు లీటర్ నీటిలో మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ నీటిలో వడలిపోయిన చెట్ల మొదళ్లు, చుట్టుపక్కల తడపాలి.

కాండం కుళ్లు: దీని నివారణకు 1.5 గ్రాముల థయోఫానెట్ మిథైల్‌ను లీటర్ నీటిలో కలిపి మొక్క కాండం అంతా తడిసేలా పిచికారీ చేయాలి.

కానోఫోరా కొమ్ముకుళ్లు తెగులు: ఈ తెగులు సోకిన లేత చిగుళ్లు మాడిపోయి కణుపుల వద్ద కొమ్మలు కుళ్లి విరిగిపోతాయి. నివారకు ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోక్లిన్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

లద్దెపురుగు: మిరపలో లద్దెపురుగు సోకే అవకాశం ఉంది. దీని నివారకు థయోడికార్బ్ గ్రాము లేదా క్లోర్‌ఫిన్‌ఫైర్ రెండు మిల్లీ లీటర్లు లేదా స్పైనోసాడ్ 0.38 మిల్లీ లీటర్లు లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వరి పంటలో..

ఇప్పటికే వరి నాట్లు వేసినట్లయితే పంటలో ఎక్కువ మోతాదులో నీరు ఉండకుండా చూడాలి. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలి. తరువాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి. ముంపు పాలైన వరి పొలాల్లో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది.



తెగుళ్లు.. నివారణ చర్యలు

ఆకుముడుత పురుగు: ఈ పురుగు పత్రహరితాన్ని హరించడంతో ఆకులు తెల్లబడుతాయి. దీని నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2–3 సార్లు లాగితే పురుగులు కిందబడిపోతాయి. క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా కార్టాప్‌హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాన్ నిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రాములు లేదా 48 ఎస్‌సీ 0.1 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి వాడాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జీ గుళికలు ఎకరాకు ఎనిమిది కిలోలు వేయాలి.

తాటాకు తెగులు: హిస్పాపిల్లా పెద్దపురుగులు ఆకులోని పత్రహరితాన్ని గోకి తినివేయడంతో తెల్లటి చారలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడతెగులు: ఆకులపై మచ్చలు పెద్దగై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీ లీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీ లీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీ లీటర్లు లేదా ప్రోపికొనజోల్ మిల్లీ లీటర్ లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ మరియు టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి చొప్పున రెండుసార్లు పిచికారీ చేయాలి.

అగ్గితెగులు: అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల లేదా ఐసోప్రోథయేలేన్ 1.5 మిల్లీ లీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

బీఈడీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



చెక్కు అందచేస్తున్న పీవో

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేబీ ప్రాంగణంలోని బీఈడీ కళాశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్ పాయ్ ప్రారంభించారు. అనంతరం అక్కడ ఉన్న లైబ్రరీలను పరిశీలించారు. పీవో రాకతో కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం పీవోను సన్మానించారు. అంతకు ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ప్రొఫెషనల్ కోర్సుల్లో రాణించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశ పరీక్షలతో డిగ్రీలోని మార్కుల ఆధారంగా గిరిజన విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నట్లు తెలిపారు. ఛాత్రోపాధ్యాయులకు అవసరమయ్యే కంప్యూటర్ ల్యాబ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఐటీడీఏ పీవో చాంబర్‌లో అంగవైకల్యం గల విద్యార్థులు హైదరాబాద్‌లోని స్వీకారామ్ కళాశాలలో చదువుకోవడానికి ఫీజుకు సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్, ఏవో రాంబాబు, విద్యార్థులు చిన్న, సందీప్, శ్రీకాంత్, బీఈడీ కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

మాదిగ హక్కుల దండోరా జిల్లా కన్వీనర్ మృతి



రాజేశ్వర్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మాదిగ హక్కుల దోండరా జిల్లా కన్వీనర్ పేర్క రాజేశ్వర్ (45) మృతి చెందాడు. మాజీ మంత్రి రామచంద్రా రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించడానికి శుక్రవారం శాంతినగర్ వచ్చినా పేర్క రాజేశ్వర్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. పేర్క రాజేశ్వర్ స్వగ్రామం బేల మండలంలోని మర్‌గూడ కాగా ఆదిలాబాద్‌లో నివాసముంటున్నాడు. పదిహేళ్ల నుంచి ఎస్సీల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నాడు. ఆయన మృతితో పలువురు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మండలంలో బోగస్ సర్టిఫికెట్ల దందా!



మీ సేవా నిర్వాహకుడిని ప్రశ్నిస్తున్న తహసీల్దార్

గుడిహత్నూర్: ప్రభుత్వ పథకాలకు దళారీలకు వరంగా మారాయి. ఈ క్రమంలో మీ సేవా, తహసీల్దార్ కార్యాలయాలను టార్గెట్‌గా చేసుకొని అక్కడ పని చేస్తున్న సిబ్బందిని మచ్చిక చేసుకొని కొందరు సర్టిఫికెట్ల దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గత కొన్ని నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతుందని తెలుస్తోంది. ముఖ్యంగా కళ్యాణలక్ష్మి పథకం ప్రారంభం నుంచి బ్రోకర్లు యథేచ్ఛగా వారి దందాను కొనసాగిస్తున్నారు. వీరికి రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది తోడు కావడంతో వీరి దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరజిల్లుతోంది. మండల కేంద్రంలోని ఓ ఆన్‌లైన్ సెంటర్‌లో జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రంతో ఇది బహిర్గతమైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని శాంతాపూర్ గ్రామానికి చెందిన సాబ్లే గోపాల్ అనే యువకుడు స్థానిక ఆన్‌లైన్ కేంద్రం నిర్వాహకుడు బాలాజీని సంప్రదించి తనకు కుల ధ్రువీకరణ పత్రాలు కావాలని చెప్పడంతో అతడి నుంచి దరఖాస్తులు స్వీకరించిన నిర్వాహకుడు ఈ నెల 14వ తేదీన ఒకసారి, 15వ తేదీన రెండుసార్లు ధ్రువీకరణ పత్రం కోసం రెవిన్యూ శాఖకు దరఖాస్తు చేసుకున్నాడు. సదరు యువకుడికి కుల ధ్రువీకరణ పత్రం అత్యవసరం ఉందనడంతో ఆన్‌లైన్ నిర్వాహకుడు బాలాజీ అధికారుల నుంచి కుల ధ్రువీకరణ పత్రం జారీ ఆమోదం కాకముందే మీ సేవ కేంద్రం ద్వారా అందించే స్టేషనరీ పత్రం పైన కుల ధ్రువీకరణ పత్రాన్ని తయారు చేసి ఇచ్చాడు. కానీ ఈ ధ్రువీకరణ పత్రంలో పుట్టిన తేదీ తప్పుగా పడడంతో దానిని సరి చేయించాలని కోరుతూ సదరు యువకుడు తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాడు. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన సందర్భంలో పొందుపరిచిన వివరాలను తహసీల్దార్ సంధ్యారాణి పరిశీలించగా అప్పటికే అతడు తీసుకువచ్చిన ధ్రువీకరణ పత్రం బోగస్ అని గుర్తించి సదరు ఆన్‌లైన్ నిర్వాహకుడిని కార్యాలయానికి పిలిపించి విచారించగా తాను మీ సేవా నుంచి పత్రాన్ని తీసుకొచ్చి ఇచ్చానని వెల్లడించాడు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులతో పాటు పోలీసులతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ సంధ్యారాణి తెలిపింది.

మణిపూర్ ఘటన దేశానికి సిగ్గుచేటు

- తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య



నిరసనలో నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: మణిపూర్‌లో మహిళలపై జరిగిన అత్యాచారం ఘటన సిగ్గుచేటని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంగారి భూమయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిందితులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులను దేశంలో లేకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని, మతాల పేరుతో ఆదివాసీలపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మణిపూర్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అని, నిందితులను వెంటనే ఉరితీయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సాయన్న, సాకి లక్ష్మణ్, చిన్నయ్య, మల్లేష్, చుంచు శ్రీనివాస్, రాజేశ్వర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీ, అమిత్‌షా బాధ్యత వహించాలి...

నిర్మల్‌చైన్‌గేట్: మణిపూర్ అల్లర్లపై ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షానే పూర్తి బాధ్యత వహించాలని పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ దేశంలో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు బంతి ముత్తవ్వ, రాణి, గంగమణి, రాజమణి పాల్గొన్నారు.

కడెం ప్రాజెక్ట్‌కు సందర్శకుల తాకిడి







భారీ వరదలతో కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో ప్రాజెక్ట్ అందాలను వీక్షించేందుకు సందర్శకులు బారులు తీరారు. ప్రాజెక్టు వరద గేట్ల వద్ద సెల్ఫీలు దిగుతూ ఉల్లాసంగా గడిపారు. స్థానికులతో పాటు ఖానాపూర్ నిర్మల్, జగిత్యాల్ తదితర ప్రాంతాలకు చెందిన సందర్శకులు రావడంతో ప్రాజెక్టు పరిసరాలు సందడిగా మారాయి. ఎగిసిపడుతున్న వరద నీటిని చూసేందుకు కడెం ప్రాజెక్టు సందర్శకులతో కిటకిటలాడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

వరదలో 'గుండేగాం'



వరదనీటిలో మునిగిన గుండేగాం వంతెన

- నిలిచిన రాకపోకలు

భైంసారూరల్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుండేగాం గ్రామం నీట మునిగింది. రంగారావుపల్సికర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ అంతా గ్రామంలోకి చొచ్చుకువస్తోంది. శుక్రవారం భైంసారూరల్ సీఐ నైలు గ్రామంలో పర్యటించిన పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గుండేగాం వంతెన నీటిలో మునగడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వంతెన సమీపంలోని వైకుంఠదామం నీటమునిగింది. గుండేగాం మీదుగా మహాగాం, పార్డి(బి), చాత తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మహాగాం పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్, సందీప్‌లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, వివిధ రోగాలకు సంబంధించిన వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా 50 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు



మునిగిన వైకుంఠధామం



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ నైలు

తాత్కాలిక మరమ్మతులు

సాక్షి స్పందన

ఖానాపూర్: పట్టణంలోని రోడ్డు వైడెంగ్ పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకన సాగడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్న విషయమై సాక్షిలో 'ఖానాపూర్‌లో నరకదారులు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్‌తో పాటు అధికారులు స్పందించారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, కమిషనర్ మనోహర్‌ల ఆధ్వర్యంలో రోడ్డుపై గుంతల్లో డస్ట్, కంకర పోయించి తాత్కాలిక మరమ్మతులు చేశారు. పలు చోట్ల ఎగువ, దిగువ ఉన్న పల్లపు ప్రాంతాలతో పాటు బురదమయంగా ఉన్న చోట మున్సిపల్ బ్లేడ్ ట్రాక్టర్ల సాయంతో చదును చేయించారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని, వర్షాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. త్వరలో పనులను వేగవంతం చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు పరాంకుశం శ్రీనివాస్, ప్రదీప్, సతీష్, నగేష్, రాజేందర్, సంతోష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



రోడ్డుపై గుంతలను పూడ్చివేయిస్తున్న నాయకులు, అధికారులు